క్లుప్తంగా

15న మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15న మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ కారే సుధ ఆధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు, తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

వేట నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలి

కొత్తపల్లి: మత్స్యకారులు సముద్రంలో వేట నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలని మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ సూచించారు. వేట నిషేధం అమలుపై సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15వ తేదీ వరకూ సముద్రంలో వేట నిషేధమన్నారు. ఈ సమయంలో మెకనైజ్డ్, మోటారైజ్డ్ బోట్లతో చేపల వేట చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమించి మత్స్యకారులు వేటకు వెళితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, పోలీసులు, మెరైన్ సిబ్బందికి మత్స్యకారులు సహకరించాలని కోరారు. తెరచాప పడవల్లో చేట వేటకు నిషేధం లేదన్నారు. మండలంలోని ఉప్పాడ, అమీనాబాదు, మూలపేట, కోనపాపపేట గ్రామాల్లో 1262 రిజిస్ట్రేషన్ బోట్లు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు టాంటాం, సమావేశాలు నిర్వహించి మత్స్యకారులకు వేట నిషేధంపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

ఎన్నికల తనిఖీ అధికారుల సంఖ్య పెంపు

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల తనిఖీ అధికారుల సంఖ్యను పెంచినట్లు పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి సుందరరెడ్డి తెలిపారు. ఇప్పటివరకూ పిఠాపురం నియోజకవరపరిధిలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రెండు షిఫ్టుల్లో టీమ్‌లు పని చేస్తున్నాయన్నారు. మిగతా నియోజకవర్గాల మాదిరిగా 12 గంటల షిఫ్టలను 8 గంటల షిప్టులుగా మార్చి అదనపు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఇక నుంచి మూడు షిఫ్టుల్లో సిబ్బంది పని చేస్తారన్నారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ లెక్చరర్ ఎం.సుందరయ్యను గొల్లప్రోలు మండలానికి, ఎస్వీ వినోద్ కుమార్ పిఠాపురం మండలానికి అదనంగా నియమించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా చల్లఘటం ఊరేగింపు



చలువ కుండను నెత్తిన పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆసాదు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి చల్లఘటం ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ ప్రత్యేకాధికారి సీహెచ్‌వీ రామ్మోహన రావు, ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాని వీరాస్వామి ఆధ్వర్యంలో ఆసాదు చలువకుండను నెత్తిన పెట్టుకుని, గరగలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఎస్సై వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నెలాఖరులోపు ఐదు శాతం రాయితీ



వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నులు ఏక మొత్తంగా ఈ నెలాఖరు 30వ తేదీ లోపు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నామని కమిషనర్ జి.వెంకటరావు వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుర పరిపాలన శాఖ ఉత్తర్వుల ప్రకారం ఆస్తిపన్నుల చెల్లింపు ఏకమొత్తంగా చెల్లించే వారికి ఈ రాయితీ వర్తిస్తుందని చెప్పారు. చెల్లించే మొత్తం ఐదు శాతం రాయితీ తగ్గించి చెల్లించాలన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలోనూ, నగర పరిధిలోని సచివాలయాల్లోనూ చెల్లించవచ్చన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

జ్యోతులకు కన్నీటి వీడ్కోలు

కాకినాడ: అనారోగ్యం కారణంగా మరణించిన మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతుల సీతారామమూర్తికి సోమవారం కుటుంబ సభ్యులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కన్నీటివీడ్కోలు పలికారు. స్థానిక విద్యుత్ రెడ్డి హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులకు పలువురు నేతలు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, కైట్ విద్యా సంస్థల చైర్మన్ పోతుల వెంకటవిశ్వం, రోటరీ డిస్ట్రిక్ట్ మాజీ చైర్మన్ లక్క రాజు సత్యనారాయణ(టిక్కు), సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు, ప్రజా సంఘాల నేతలు దువ్వా శేషుబాబ్జి, చింతపల్లి అజయ్‌కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, పలువురు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు అంత్యక్రియలకు హాజరయ్యారు.

ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం

- గ్రామాల్లో ఆలయాలు ముస్తాబు
- పంచాగ పఠనాలకు ఏర్పాట్లు పూర్తి
- భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీకి చర్యలు



ఉగాది ఉత్సవాలకు సిద్ధమైన పిఠాపురం పాదగయ క్షేత్రం

పిఠాపురం: తెలుగు నూతన సంవత్సర (ఉగాది) వేడుకలకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఆలయాల్లో మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పంచాగ పఠనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో క్రోధినామ తెలుగు సంవత్సరాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం పండితులు పంచాగ పఠనం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగ పుస్తకాలు, విసనకర్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలోనూ పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు చేశారు. కొత్తపల్లిలో వేంచేసిన శ్రీధర్మశాస్తా దేవస్థానంలో ఉగాది వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. గొల్లప్రోలులోని ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయం, విష్ణాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం పండితులు పంచాంగ పఠనం చేస్తారు. తాటిపర్తిలోని అపర్ణాదేవి సమేత నాగేశ్వరస్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అర్చకులు ఆకొండి వెంకటేశ్వర శర్మ పంచాంగ పఠనం చేస్తారు. చేబ్రోలులోని ఉమారాలింగేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలతో పాటు ఉగాది పచ్చడి పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

ఉగాది పచ్చడికి చేదు అనుభవం

షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడికి ఉన్న డిమాండ్ మరే పచ్చడికి ఉండదు. పులుపు, కారం , చేదు, తీపి, వగరు, ఉప్పు వంటి ఆరు రకాల రుచులతో తయారు చేసే ఉగాది పచ్చడికి ఈ ఏడాది చేదు అనుభవం ఎదురైంది. ఈ ఏడాది ఉగాది పర్వదినం కొంత ఆలస్యంగా రావడంతో ఉగాది పచ్చడిలో తప్పనిసరిగా వాడుకునే వేప పువ్వు అందని ద్రాక్షగా మారింది. ఇప్పటికే వేప చెట్లకు పూత పోయి కాయలు వచ్చేయడంతో వేప పువ్వు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెలలోనే విరబూసిన వేప చెట్లు ప్రస్తుతం పూత లేకుండా కాయలతో కనిపిస్తుండడంతో వేపపువ్వు కోసం వెదుకులాట ప్రారంభించారు. సోమవారం ఉదయం నుంచి గ్రామాల్లో భక్తులు వేపపువ్వు సేకరించే పనిలో పడ్డారు. చెట్లు, తొటల్లో తిరిగినా కొన్ని వేప చెట్లు మాత్రమే పూతతో ఉండడంతో అతి కష్టం మీద వేపపువ్వు సంపాదించారు.

వేప చెట్టుతో వెయ్యి లాభాలు



పువ్వుతో ఉన్న వేప చెట్టు

సామర్లకోట: ఉగాది అనగానే వేప చెట్టు గుర్తుకొస్తుంది. వేప పువ్వును ఉగాది పచ్చడిలో వాడడం తెలుగు వారి ఆనవాయితీ. అసామాన్య వృక్షమైన వేప చెట్టును కొంత మంది దేవతగా పూజిస్తారు. ఉగాదికి ముందు రోజు అమావాస్య సందర్భంగా పొలాల్లోకి, వేప చెట్ల వద్దకు వెళ్లి వేప పువ్వును సేకరిస్తారు. వేప పువ్వుతో తయారు చేసిన పచ్చడి సేవించడం వల్ల తీపి, చేదు అనుభవాలను ఏడాది పొడవునా అనుభవించే శక్తి లభిస్తుందనేది ఓ నమ్మకం, వేప పువ్వు, బెల్లం, కొత్త చింతపండు, అరటి పండ్లు, వేపిన శనగపప్పు, మామిడికాయ ముక్కలు వేసి పచ్చడి తయారు చేస్తారు. వేప చెట్టుతో వెయ్యి లాభాలున్నాయని పెద్దలు చెబుతారు. ఎన్నో ఔషధ గుణాలున్న చెట్టుగా ప్రసిద్ధి చెందింది. వేప చెట్టు గాలి పీల్చడం వల్ల అనేక రోగాలు దూరమవుతాయని నమ్మకం, వేప పుల్లతో పళ్లు శుభ్రం చేసుకుంటే బలంగా ఉంటాయి. వేప చెక్కతో ఇంటి తలుపులు చేసుకోవడంతో పాటు, ఫర్నిచర్ తయారుచేస్తారు. వేప పిండి పొలాలకు మేలు చేస్తుంది. వేప నూనె ఎక్కువగా తలకు ఉపయోగిస్తారు. వేప చెట్టుతో హానికరమైన బ్యాక్టీరియా పూర్తిగా నశిస్తుంది.

ఔషధ గుణాలు అది'రేలా'..



సీబీ దేవం రోడ్డులో ఆకర్షిస్తున్న రేలా వృక్షం

పెద్దాపురం: ఆకర్షణీయంగా కనిపించే అరుదైన వృక్షం రేలా చెట్టు. శాస్త్ర పరిభాషలో దీన్ని కేసియా ఫిస్టుల్లా అంటారు. అనేక వ్యాధులను నయం చేసే గుణాలున్న దీనిని సంస్కృతంలో అరగ్వద(రోగ నివారిణి)గా పిలుస్తారు. ఆంగ్లంలో గోల్డెన్ రెయిన్ ట్రీ అని, హిందీలో అమల్‌బాస్‌గా పరిగణిస్తారు. గుత్తులుగా వేలాడే పసుపు పచ్చని పూలతో అందంగా కనిపిస్తుంది. పెద్దాపురం పట్టణానికి ఎనిమిది కి.మీ. దూరంలో చినబ్రహ్మదేవం గ్రామ రహదారిలో ఈ చెట్టు నిండా పూలతో కనువిందు చేస్తోంది.

సర్వరోగ నివారిణిగా..

అద్భుతమైన ఔషధ గుణాలు ఈ రేలా చెట్టు సొంతం. కొంతమంది దేవతా వృక్షంగా దీన్ని భావించి, చుట్టూ తిరుగుతూ రేలారేలారే అంటూ పాటలు పాడేవారు. దీన్ని బెరడును ఆయుర్వేదంలో నొప్పి నివారణకు, గాయాలు శుభ్రపర్చే ఔషధంగా వినియోగిస్తున్నారు. పొడవాటి కాయల్లోని పిప్పిని మందుగా వాడుతారు. పేగు ద్రవ్యరాశిలో నీటి సమతుల్యానికి కాపాడేందుకు దీన్ని వినియోగిస్తారు. చర్మరోగ నివారణకు, జ్వరం తగ్గేందుకు దోహదపడుతుంది. ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే దీని పూలు విరగపూస్తాయి. సర్వరోగ నివారిణిగా పిలిచే ఈ చెట్టు భాగాలు రూమాటిజం, గౌట్ వ్యాధుల నివారణకు ఉపయోగపడతాయి. దీనిని పెరట్లో పెంచుకుంటే పర్యావరణ పరిరక్షణతో పాటు, ఆరోగ్య సంరక్షణ కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాల కుట్ర



పిఠాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత తదితరులు



ఎన్నికల ప్రచారంలో భాగంగా దుస్తులు ఇస్త్రీ చేస్తున్న వంగా గీత

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పిఠాపురంలో ఎన్నికల ప్రచారం

పిఠాపురం: గ్రామ వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు కుట్రపన్ని వారిని పేదలకు దూరం చేశారని వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత అన్నారు. పిఠాపురం పట్టణంలోని 1, 31 వార్డుల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు వేయడం మీపని అభివృద్ధి చేయడం నా పని అంటూ ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి వార్డులోనూ జనం ఆమెకు బ్రహ్మరథం పట్టారు. ఆయా వార్డుల్లో ప్రతి గడపకూ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ప్రజలతో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా, పిఠాపురం ప్రజల ఆడపడుచూగా ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు సాదర స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లను సేవలకు దూరం చేసిన ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పడంతో పాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల ముందుకే పాలనను తీసుకురావడంతో పాటు సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరారు. ఇప్పటివరకూ తాను పిఠాపురం పట్టణంలో చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వజ్రపు శైలజ, వజ్రపు భువనేశ్వరి, వజ్రపు వీరేష్, బత్తిన రాజశేఖర్, వజ్రపు బాబీ, దిమ్మల సత్తిబాబు, కిరణ్ బాటియా, చెక్కా అశోక్, బీరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌తో మాదిగ ఐక్యవేదిక నేతల భేటీ



చలమలశెట్టి సునీల్‌ను కలిసిన మాదిగ ఐక్య వేదిక నాయకులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను నియోజకవర్గ పరిధిలోని మాదిగ ఐక్యవేదిక నాయకులు సోమవారం సాయంత్రం కాకినాడలో మాజీ కౌన్సిలర్ కాళ్ల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కలుసుకున్నారు. నియోజక వర్గంలోని మాదిగలు ఐక్యంగా వైఎస్సార్ సీపీకి మద్దతివ్వాలని నిర్ణయించినట్టు ఐక్యవేదిక నాయకులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మాదిగలు తమ మద్దతు తెలియజేస్తూ ఈ నెల 12న మాదిగల విజయ సంకల్ప సభను నిర్వహిస్తున్నట్టు కాళ్ల లక్ష్మీనారాయణ ఎంపీ అభ్యర్థి సునీల్‌కు తెలిపారు. వైఎస్సార్ సీపీకి మద్దతిస్తూ ఏర్పాటు చేసే ఈ సభకు హాజరు కావాలని మాదిగ ఐక్యవేదిక నాయకులు ఆహ్వానించారు. మాదిగల హక్కుల సాధన వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఎంపీగా సునీల్ విజయం సాధిస్తే కాకినాడ, పరిసర ప్రాంతాల్లో అనేక పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని కాళ్ల లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని మాదిగ ఐక్య వేదిక నాయకులు కట్టుబడి ఉన్నారని చెప్పారు. మాదిగ ఐక్య వేదిక నాయకులు వల్లూరి నాని తదితరులు ఉన్నారు.

'వారెవ్వా జతగాళ్లు'కు స్పెషల్ జ్యూరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న దర్శకుడు సత్య

సామర్లకోట: స్థానిక నటీనటుల ఆధ్వర్యంలో నిర్మాణమైన వారెవ్వా జతగాళ్లు చిత్రానికి స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. విజయవాడ హ్యాపీ రిసార్ట్స్‌లో ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఉగాది సినిమా పురస్కారాల్లో ఈ సినిమాకు స్పెషల్ జ్యూరి అవార్డును సీనియర్ నిర్మాత ఏవీ రత్నం, క్యారెక్టర్ ఆర్టిస్ట్ అజయ్‌గోస్, ఫిలిం చాంబర్ ప్రతినిధులు అంబటి మధుమోహన్‌కృష్ణ, మోహన్‌గౌడ్ అందజేసినట్టు చిత్ర దర్శకుడు సలాది సత్య సోమవారం ఇక్కడ విలేకర్లకు తెలిపారు. ఈ చిత్రంలో నటీనటులుగా, టెక్నీషియన్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్‌గా గరగ వీరబాబు, బండారు నాగబాబు, దొడ్డి వీరప్రభాకర్ వ్యవహరించారు. తొలి ప్రయత్నంలోనే చిత్రానికి అవార్డు దక్కడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. సినిమా విడుదలై 8 రోజులు విజయవంతంగా ప్రదర్శితమైందన్నారు. ప్రాంతీయ భావంతో ప్రతిఒక్కరూ చిత్ర విజయానికి కృషి చేశారని దర్శకుడు తెలిపారు.

భక్తులతో నూకాలమ్మ ఆలయం కిటకిట



సామర్లకోటలో నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



యండపల్లిలో నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ అమ్మవారు

సామర్లకోట: స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయం సోమవారం సాయంత్రం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో సోమవారం నుంచి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉచిత దర్శనంతో పాటు, రూ.10, రూ.20 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు చీరలు, కోళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య, కమిటీ సభ్యులు పెనుమర్తి వీరవెంకట సత్యనారాయణ, మార్ని శ్రీనివాసు, బొమ్మాలరావు, యార్లగడ్డ శ్రీనివాసు, సత్తి అరుణ భక్తులకు సేవలందించారు. రాత్రి స్థానిక శెట్టిబలిజపేటలో జాతర ఉత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద తిరనాళ్ల ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఏర్పాటు చేశారు.

వైభవంగా నూకాలమ్మ తీర్థం

కొత్తపల్లి: కొత్త అమావాస్యను పురస్కరించుకొని గ్రామాల్లో నూకాలమ్మ తల్లి జాతరలు, తీర్థ మహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉగాది ముందు రోజు వచ్చే కొత్త అమావాస్యకు ఎంతో విశిష్టత ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో కొత్త అమావాస్యకు అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తారు. యండపల్లిలో నూకాలమ్మతల్లి తీర్థం ఘనంగా జరిగింది. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, అమీనాబాద్, రమణక్కపేట తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక నూకాలమ్మ యూత్ సభ్యులు భక్తులకు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు.

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమారారామ భీమేశ్వర స్వామి

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. సోమవతి అమావాస్య (కొత్త అమావాస్య) సోమవారం పర్వదినం కలిసి రావడంతో తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తొలి అభిషేకం, తొలి పూజలు చేయగా, తిలకించడానికి భక్తులు భారులు తీరారు. ఈ సందర్భంగా స్వామి వారిని, అమ్మవార్లతో పాటు, ఉప ఆలయాల్లోని దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అళ్లకి రాజ్‌గోపాల్, సన్నిదిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో పంచాగ శ్రవణం ఉంటుందని ఈఓ నీలకంఠం తెలిపారు. ఉగాది రోజు నుంచి ఈ నెల 17 వరకు ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఈఓ చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, పంచాగ శ్రవణంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి లలిత అష్టోత్తర సహస్రనామాలు, కుంకుమార్చనలు ఉంటాయని వివరించారు. భక్తుల గోత్రనామాలు చదవడానికి రూ.200 చెల్లించి రసీదు పొందాలన్నారు.

వైభవంగా కొత్త అమావాస్య వేడుకలు



చేబ్రోలు ముత్యాలమ్మ వారు



గొల్లప్రోలులో వేంచేసిన నూకాలమ్మ

- ఊరూరా నూకాలమ్మ జాతరలు, తీర్థ మహోత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

గొల్లప్రోలు: కొత్త అమావాస్యను పురస్కరించుకుని సోమవారం మండలంలోని చేబ్రోలులో ముత్యాలమ్మ, నూకాలమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. చేబ్రోలులో ఏటా కొత్త అమావాస్యకు వారం రోజుల ముందు అమ్మవారి జాతర మహోత్సవాలను ప్రారంభిస్తారు. దీనిలో భాగంగా గత వారం రోజులుగా గ్రామంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గరగ నృత్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి జాగారం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

చెందుర్తిలో...

మండలంలోని చెందుర్తిలో సోమవారం నూకాలమ్మ తీర్థం ఘనంగా జరిగింది. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలోని పాత బస్టాండ్, తాడిపర్తి రోడ్డు, దేవీనగరం ప్రాంతాల్లో సోమవారం నూకాలమ్మ తీర్థం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఆలయాల వద్ద గొల్లప్రోలు ఎస్సై బాలాజీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మామిడి పోతున్నాయ్



చెట్టుకు ఉండగానే రంగుమారిన మామిడి కాయలు



కుళ్లిపోయి.. నేలరాలిన మామిడి కాయలు

- రంగుమారి రాలిపోతున్న మామిడి కాయలు
- అంతుచిక్కని వ్యాధి వ్యాప్తి

పిఠాపురం: ఎండలు, తెగుళ్ల ధాటికి మామిడి కాయలు మాడిపోతున్నాయి. పచ్చగా నిగనిగలాడాల్సిన మామిడి కాయలు రంగుమారి నేలరాలిపోతున్నాయి. అంతుచిక్కని వ్యాధి విజృంభించడంతో మామిడి కాయలు పురుగులు పట్టి కుళ్లిపోతున్నాయి. చెరకురసం, కొత్తపల్లి కొబ్బరి, కలెక్టరు, బంగినపల్లి, రసాలు వంటి అన్ని రకాలు మామిడి కాయలు వ్యాధి బారిన పడి ఎదుగుదల లేకుండా రాలిపోతున్నాయి. తీవ్ర నష్టాల పాలవుతున్నామని మామిడి రైతులు వాపోతున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని, కాపు అంతా నేలపాలవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడి తోటలను పరిశీలించి వ్యాధిని నిర్ధారించి చర్యలు తీసుకుంటామని ఉద్యానశాఖాధికారి శైలజ తెలిపారు.